క్లుప్తంగా

18న జాబ్ మేళా

నంద్యాల(న్యూటౌన్): ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 18వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. బుధవారం నంద్యాలలోని స్థానిక కార్యాలయంలో జాబ్ మేళా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేఎల్ గ్రూపు, సైనీ గ్రామ్ ప్రైవేటు లిమిటెడ్, తదితర ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు ఉద్యోగార్థులను ఎంపిక చేసుకుంటారని, యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదవ తరగతి, ఐటీఐ, డిప్లొమో, ఇంటర్, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. మరింత సమాచారం కోసం సెల్ 6303244165, 9542643747 నంబర్లను సంప్రదించాలన్నారు. అలాగే డోన్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు.

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాల క్రీడా మైదానంలో క్రీడా భారతి ఆధ్వర్యంలో జిల్లా సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ డబుల్స్ క్రీడాపోటీలను క్రీడా భారతి రాయలసీమ జోన్ చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్, సెక్రటరీ నిమ్మకాయల సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువే కాకుండా క్రీడల్లోనూ రాణించాలన్నారు. గతంలో పీవీ సింధు నంద్యాల నుంచే క్రీడాకారిణిగా బ్యాడ్మింటన్‌లో రాణించిందన్నారు. క్రీడా భారత్ లక్ష్యంగా పోటీల్లో పాల్గొని మెడల్స్ సాధించాలన్నారు. పీజీ కళాశాల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, కోచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో దూదేకులకు అన్యాయం

నంద్యాల(వ్యవసాయం): టీడీపీ ప్రభుత్వంలో దూదేకుల సామాజికవర్గం వారికి 5 చైర్మన్ పోస్టులు, నాన్‌మైనార్టీ, మైనార్టీ సంస్థల్లో అర్హులైన వారికి డైరెక్టర్ పదవులు కేటాయించాలని ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ బాబన్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి వెన్నుండి ఎంతో మంది సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్, వార్డు మెంబర్లుగా పని చేయడం జరిగిందని, కూటమి ప్రభుత్వంలో దూదేకుల సంఘం వారికి పదవులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. సంఘం అధ్యక్షుడు షేక్షావలి, ఆదాము, మిద్దె చిన్నహుసేని, దస్తగిరి, హుసేన్, తదితరులు పాల్గొన్నారు.

జియోట్యాగింగ్ వేగవంతం చేయాలి

దొర్నిపాడు: హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్‌ను వేగవంతం చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌చార్జ్, డీఎల్‌డీఓ శివారెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యలయ ఆవరణలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన వారందరికీ బ్యాంకు ఖాతా తెరవాలన్నారు. అలాగే బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ తప్పని సరిగా లింక్ అయ్యి ఉండాలన్నారు. ఈనెల 15 తేదీ నాటికి ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సులోచన తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మునిలక్ష్మి


ధ్వంసమైన కారు

చాగలమర్రి: మండల కేంద్రంలో 40వ నంబర్ జాతీయ రహదారిపై నాయారా పెట్రోల్ బంకు సమీపంలో బుధవారం రోడ్డుకు అడ్డంగా వచ్చిన గేదెను కారు ఢీకొట్టి బోల్తా పడిన ప్రమాదంలో ఒకరికి గాయలయ్యాయి. ఈ ప్రమాదంలో గేదె అక్కడికక్కడే మృత్యువాత పడగా కారు రోడ్డు పక్కనే ఉన్న గుంతలో పడి నుజ్జునుజ్జయ్యింది. వివరాలు.. డోన్ పట్టణానికి చెందిన కుటుంబసభ్యులు మునిలక్ష్మీ, మునిరత్నం, లీలా కృష్ణ, కవిత బుధవారం బంధువుల ఇంటికి పుత్తూరుకు బయలుదేరారు. చాగలమర్రిలోని 40వ నంబరు జాతీయ రహదారిపై వెళుతుండగా గేదె అడ్డంగా రావడంతో కారు వేగంగా ఢీకొట్టింది. గేదె అక్కడికక్కడే మృతి చెందగా కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలో బోల్తా పడి ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న మునిలక్ష్మికి గాయాలు కావడంతో 108 వాహనంలో స్థానిక కేరళ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమయంలో కారులోని ఎయిర్ బ్యాగ్‌లు తెరచుకోవడంతో మిగతా వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాదంపై విచారణ జరుపుతున్నారు.

అక్రమ మద్యం విక్రేతలపై కేసులు

గోస్పాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట ప్రసాద్ బుధవారం తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడులు చేసి విక్రేతలను అరెస్ట్ చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మండలంలోని ఎం.కృష్ణాపురం గ్రామానికి చెందిన ఉసేన్‌వలి వద్ద 19, యాళ్లూరు గ్రామానికి చెందిన భాస్కర్ వద్ద నుంచి 17 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

‘మెనూ’ భారం

- ధరలకు అనుగుణంగా పెరగని కుకింగ్ చార్జీలు
- వినతులు, డిమాండ్లకు స్పందించని సర్కారు
- మెనూ ప్రకారం నిధులు ఇవ్వాలంటున్న మధ్యాహ్న భోజన సిబ్బంది


పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): రుచికరమైన, పౌష్టిక విలువలతో కూడిన భోజనం పెట్టి పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడం, బడిఈడు పిల్లలు బడికి వెళ్లాలన్న ఆశయాన్ని నెలవేర్చడం, ఆరోగ్యవంతమైన రేపటి పౌరులను తయారు చేయడం వంటి బృహత్తరమైన లక్ష్యాలను సాధించాలంటే ప్రభుత్వం తగినన్ని వనరులు సమకూర్చాల్సిన అవసరం ఉంది. ఏదో అమలు చేసేస్తున్నాం అన్నట్టు గాకుండా లక్ష్యశుద్ధి ఉండాలి. ప్రస్తుత పరిస్థితుల్లో కూరగాయల ధరలతో పాటు నిత్యావసర వస్తువులు సైతం పోటీ పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఇచ్చే అరకొర చెల్లింపులతో పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని ఏ నిర్వాహకులైనా ఎలా పెట్టగలరో పాలకులే ఆలోచించాలి. కుకింగ్ చార్జీలు పెంచాలని నిర్వాహక ఏజెన్సీలు మొర పెట్టుకుంటున్నా ప్రభుత్వం నుంచి ఉలుకూ పలుకూ ఉండడం లేదు. పాఠశాలలు పునఃప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్నా నేటికీ మధ్యాహ్న భోజన పథకంలో మెనూ చార్జీలపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. విద్యార్థులకు పౌష్టికాహారం సమర్థవంతంగా అందించాలంటే కుకింగ్ చార్జీలు పెంచాల్సిన అవసరం ఉందని సిబ్బంది కోరుతున్నారు.

పెరిగిన ధరలు ఇలా..

ఇటీవల కాలంలో నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఏ కాయగూర కొందామన్నా కేజీ రూ.40 పైనే పలుకుతోంది. దీనికి తోడు ఆయిల్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్ ధర ఆకాశాన్నంటుతున్నాయి. ఈ ధరలతో ప్రభుత్వ లక్ష్యాలను ఎలా సాధించాలని నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో వారానికి ఐదు రోజులు కోడిగుడ్డు ఇస్తున్నారు. పెరిగిన ధరలను దష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో కుకింగ్ చార్జీలను పెంచాలని ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలు డిమాండ్ చేస్తున్నాయి. అలాగే మధ్యాహ్న భోజన పథకానికి గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని కోరుతున్నాయి.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

జిల్లాలో 1428 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. 2820 మంది కుక్ కమ్ హెల్పర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. 1.57,922 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తింటున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఒక్కో విద్యార్థికి 100 గ్రాములు, ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి 150 గ్రాముల బియ్యాన్ని అందజేస్తారు. మెనూ చార్జీల కింద ప్రాథమిక పాఠశాల విద్యార్థికి రూ.5.88 చెల్లిస్తుండగా, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల స్థాయిలో ఒక్కో విద్యార్థికి రూ.8.57 చెల్లిస్తున్నారు.

ప్రస్తుతం భోజనం మెనూ

సోమవారం :	వెజిటబుల్ పలావ్, బంగాళాదుంప కర్రీ, గుడ్డు, చిక్కీ
మంగళవారం :	చింతపండు పులిహోర, దొండకాయ పచ్చడి, గుడ్డు, రాగి జావ
బుధవారం :	కూరగాయల అన్నం, బంగాళాదుంప కూర, చిక్కీ, గుడ్డు
గురువారం :	నిమ్మకాయ పులిహోర, టమాటా చట్నీ, గుడ్డు, రాగిజావ
శుక్రవారం :	అన్నం, ఆకుకూర పప్పు, గుడ్డు, చిక్కీ
శనివారం :	ఆకుకూరతో అన్నం, కూరగాయల దాల్, స్వీట్, రాగి జావ

కుకింగ్ చార్జీలు పెంచాలి



మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలంటే పెరిగిన ధరలకు అనుగుణంగా కుకింగ్ చార్జీలను తప్పనిసరిగా పెంచాల్సిన అవసరం ఉంది. ప్రాథమిక పాఠశాలల పరిధిలో ఒక్కో విద్యార్థికి రూ.8, ప్రాథమికోన్నత పాఠశాలల పరిధిలో ఒక్కో విద్యార్థికి రూ.15 ఇవ్వాలి. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. –నగరి శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి, నంద్యాల

ప్రభుత్వం పునరాలోచించాలి



ప్రభుత్వం కుకింగ్ చార్జీలపై పునరాలోచించాలి. పాఠశాలలు పునః ప్రారంభించి దాదాపు ఐదు నెలలు కావస్తోంది. ఇప్పటివరకు కుకింగ్ చార్జీలు పెంచకపోవడం దారుణం. ఇప్పుడున్న కుకింగ్ చార్జీలను ప్రస్తుతం ఉన్న ధరలతో పోలిస్తే పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం చాలా కష్టం. –శివయ్య, సెక్రటరీ, నంద్యాల

ఆళ్లగడ్డలో 5,568 గృహాలు పూర్తి


ఉయ్యాలవాడలో విచారణ చేపట్టిన హౌసింగ్ డీఈ

ఉయ్యాలవాడ: ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో 5,568 గృహాలు పూర్తయినట్లు హౌసింగ్ డీఈ విజయ్‌బాబు తెలిపారు. ఉయ్యాలవాడలో గృహం నిర్మించుకున్నా బిల్లు మంజూరు కాలేదని గత నెల 24వ తేదీన ఎమ్మెల్యే అఖిలప్రియ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పగిడాల ఓబులమ్మ, నాగలక్ష్మి ఫిర్యాదు చేయగా, బుధవారం హౌసింగ్ డీఈ బాధితుల వద్దకు వచ్చి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. 2019లో మంజూరైన బిల్లులు చెల్లింపుల్లో ఆలస్యం కావడంతో ప్రభుత్వం వాటిని చెల్లించేందుకు చర్యలు తీసుకుందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియోజకవర్గంలో 9,502 మందికి గృహాలు మంజూరు చేసిందని, వీటిలో 5,568 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాల్లో నగదు జమ అయ్యిందని చెప్పారు. 1,564 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం ప్రారంభించారని, 1,262 గృహాలు బేస్‌మట్టం లెవల్, 393 గృహాలు లెంటల్ లెవల్, 330 మంది స్లాబ్ లెవల్‌లో నిర్మాణాలు కొనసాగుతున్నాయని వివరించారు. మార్చి నెలాఖరులోగా నిర్మాణాలు పూర్తి చేసుకుంటే లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాల్లో నగదు జమవుతుందని డీఈ స్పష్టం చేశారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, హౌసింగ్ ఏఈ నరసింహరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ షాదిక్‌బాషా, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రభాకర్, శిరీషలు పాల్గొన్నారు.

పేదలకు పక్కా గృహాలు నిర్మించాలి


మాట్లాడుతున్న ప్రసాద్

నంద్యాల(న్యూటౌన్): అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం నంద్యాల పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికై ఈనెల 18వ తేదీన గ్రామ సచివాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. టీడీపీ ప్రభుత్వం పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాగునీరు, డ్రైనేజీ, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు ఇసుక సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముడి సరుకులు విపరీతంగా పెరగడం వల్ల ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలన్నారు. ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసులు, ధనుంజయుడు, హబీబ్, ఖలీల్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

‘సూపర్‌సిక్స్’ పేరుతో వంచన

నంద్యాల(అర్బన్): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను దగా చేసిందని నంద్యాల కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు చింతలయ్య విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా అంకెల గారడిగా ఉందని, ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకం అమలుకు రూ.10 వేల కోట్లకు పైగా నిధులు కావాల్సి ఉండగా రూ.4500 కోట్లు మాత్రమే కేటాయింపులు చేసి రైతాంగాన్ని మోసం చేశారని మండిపడ్డారు. ఆడబిడ్డ నిధి కింద 18 – 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్న మాట నిలుపుకోలేకపోయారని, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం హామీ అటకెక్కిందని విమర్శించారు. ఆ పార్టీ నాయకులు ఎస్‌వైడీ ప్రసాద్, సలాం, నరసింహులు, రవి, శీను, తదితరులు పాల్గొన్నారు.

ముసురుతో ఆందోళన

రుద్రవరం: మండలంలో బుధవారం వాతావరణం ముసురుకోవడంతో పాటు ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం ఖరీఫ్‌లో సాగు చేసిన వరి, మొక్కజొన్న కోతలు జోరుగా సాగుతున్నాయి. వచ్చిన ధాన్యాన్ని ఆర్అండ్‌బీ రోడ్లు, బయలు ప్రదేశాల్లో ఆరబోసి విక్రయించుకుంటున్నారు. ఇలాంటి సమయంలో వాతావరణం ముసురుకోవడంతో రైతుల్లో వణుకు పుట్టింది. మధ్యాహ్న సమయంలో ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులు వీస్తూ వర్షపు చినుకులు రాలుతుండటంతో రైతులు పరుగులు తీశారు. నర్సాపురం, రుద్రవరం, కొండమాయపల్లె, ఎల్లావత్తుల, డీ.కొట్టాల, పెద్దకంబలూరు, అప్పనపల్లె, ముత్తలూరు, టీ.లింగందిన్నె, ఆర్.నాగులవరం తదితర గ్రామాల పరిధిలో ఆరబోసిన ధాన్యం తడవకుండా కుప్పలుగా చేసి పట్టలు కప్పి ఉంచారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్

- పరారీలో మరొకరు
- ఎనిమిది మోటార్‌సైకిళ్లు స్వాధీనం


దొంగల నుంచి రికవరీ చేసిన బైక్‌లను పరిశీలిస్తున్న డీఎస్పీ రవికుమార్

ఆళ్లగడ్డ: విలాసవంతమైన జీవితం గడిపేందుకు శారీరక శ్రమ లేకుండా అడ్డదారి సంపాదన కోసం బైక్ చోరీలనే మార్గంగా ఎంచుకున్న ముగ్గురు దొంగల ఆగడాలకు ఆళ్లగడ్డ పోలీసులు చెక్ పెట్టారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చోరీల వివరాలను ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ వెల్లడించారు. కర్ణమయ్య వీధికి చెందిన శెట్టి లక్ష్మీకుమార్ ఐటీఐ చదువుతూ మధ్యలో ఆపేశాడు. ఈ క్రమంలో జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో మరో ఇద్దరు మైనర్లతో కలిసి వైఎస్సార్ కడప, అనంతపురం జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడ్డారు. చోరీ చేసిన బైక్‌లను విక్రయించగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవారు. ఈ క్రమంలో ముగ్గురు నిందితులు మూడు బైక్‌లను విక్రయించేందుకు వెళ్తుండగా అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. శెట్టి లక్ష్మీకుమార్‌తో పాటు ఒక బాలుడి ని అదుపులోకి తీసుకోగా మరో బాలుడు పరార్ అయ్యాడు. నిందితుల నుంచి 8 మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.7,70,000 ఉంటుందని డీఎస్పీ తెలిపారు. దొంగను రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీఐ చిరంజీవి, ఎస్ఐ నగీనా పాల్గొన్నారు.

జీవామృతంతో నాణ్యమైన దిగుబడులు


హరినగరం వద్ద రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నాగేంద్ర ప్రసాద్

రుద్రవరం: జీవామృతంతో మంచి దిగుబడులు సాధించి తోటి రైతులకు ఆదర్శంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. మండల పరిధిలోని హరినగరం సమీపంలో బుధవారం ×పొలం పిలుస్తోంది÷ కార్యక్రమం నిర్వహించారు. రైతులు ఇటీవల సాగు చేసిన మినుము, మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. సీజన్ల వారీగా పంటలకు సోకే తెగుళ్లు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అటువైపు మొక్కజొన్న సాగు చేసిన ఓ రైతు రసాయన ఎరువులు వినియోగించకుండా స్వతహాగా జీవామృతం తయారు చేసుకొని పంటకు వాడటాన్ని గమనించారు. జీవామృతం తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. జీవామృతం వినియోగంతో మంచి దిగుబడులు సాధించి అందర్శంగా నిలవాలని సూచించారు. ఏఈఓ రాజు, ఇతర సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి ప్రణాళికపై నేడు శిక్షణ

ఉయ్యాలవాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీల అభివృద్ధి, ప్రణాళికలపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఏపీఓ, ఏపీఎం, పీహెచ్‌సీ, పశువైద్య అధికారులు, వ్యవసాయశాఖ, గ్రామైక్య సంఘం సభ్యులు, డిజిటల్ అసిస్టెంట్లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

దొర్నిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సులోచన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చాగలమర్రి: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గురువారం గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

కోలుకోలేక వృద్ధుడి మృతి

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామానికి చెందిన పత్తూరి దేవరాజు (61) అనే వృద్ధుడు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. దేవరాజు ఈ నెల 4వ తేదీన ఇంటి పైనుంచి కిందికు దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. అతని కుమారుడు ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ స్పష్టం చేశారు.

నేడు గ్రంథాలయ వారోత్సవాలు

ఉయ్యాలవాడ: స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారిణి సంగీత లక్ష్మి తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ.. ఈ నెల 14న బాలల దినోత్సవ వేడుకలు, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయాల ప్రాముఖ్యతపై ప్రముఖుల ప్రసంగాలు, 17న స్వాతంత్ర్య పోరాట యోధులను స్మరించుకోవడం, 18న విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, ఆటల పోటీలు, 19న మహిళా సాధికారతపై చర్చ, 20న వారోత్సవాల ముగింపు సందర్భంగా వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందని వివరించారు.

ఒలింపియాడ్‌లో ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణ సమీపంలోని క్రాంతినగర్‌లో ఉన్న శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు ఐఐటీ, ఒలింపియాడ్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో విజయం సాధించినట్లు ఆ పాఠశాల చైర్మన్ సుధాకర్ తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ అభ్యాస్ అకాడమీ నిర్వహించిన ఐఐటీ ఒలింపియాడ్ పరీక్షల్లో 8వ తరగతి విద్యార్థి లోకేష్ రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు, 7వ తరగతి విద్యార్థి సంతోష్ మూడో ర్యాంకు, 6వ తరగతి విద్యార్థి పూర్ణచంద్ర రెండవ ర్యాంకు సాధించినట్లు వెల్లడించారు. విద్యార్థులకు మొమెంటోలు అందజేశారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని 17వ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. ఉదయమే వెళ్లి శానిటేషన్ పనులను పరిశీలించారు. ప్రతిరోజూ తప్పనిసరిగా మురుగు కాల్వల శుభ్రత, శానిటేషన్ పనులు చేపట్టాలని సూచించారు. విధులకు డుమ్మా కొడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

నంద్యాల(అర్బన్): సీసీ రోడ్లు, డ్రైన్ల ఏర్పాటు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రాజకుమారి హెచ్చరించారు. మండలంలోని చాపిరేవుల గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సమీపంలో ఏర్పాటవుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆమె పరిశీలించారు. పనుల నాణ్యతపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు.

వైభవంగా దామోదర కల్యాణం


సంజీవనగర్ రామాలయంలో దామోదర కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): కార్తీక మాసం ద్వాదశి పురస్కరించుకొని ప్రజలు బుధవారం ఆలయాల్లో, ఇళ్లలో తలసి, ఉసిరి చెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో దామోదర కల్యాణాన్ని శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి చెట్టు కొమ్మలకు ప్రత్యేక అలంకరణ గావించి వేదమంత్రాల సాక్షిగా కల్యాణాన్ని వేదపండితులు జరిపించారు. ఈ సందర్భంగా వేదపండితుడు పవన్‌శర్మ మాట్లాడుతూ.. పద్మపురాణం ప్రకారం కార్తీక మాసంలోని ద్వాదశి రోజున దామోదర కల్యాణం నిర్వహిస్తే శ్రీవిష్ణుమూర్తి అనుగ్రహం కలుగుతుందని, అన్ని శుభాలు కలుగుతాయన్నారు. అదే విధంగా శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి దేవస్థానంలో దామోదర కల్యాణాన్ని చైర్మన్ యాడికి శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సూరయ్య, శ్రీనివాస్, ఈఓ నాగప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నవనందుల ప్రదక్షిణకు ఏర్పాట్లు పూర్తి


ముద్ర ఫర్ నంది కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): నవనందుల నియలమైన నంద్యాల జిల్లాలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ‘ఇన్ టాక్ మన ఊరు’, ‘మన గుడి – మన బాధ్యత’ టూరిజం శాఖ ఆధ్వర్యంలో నవనందుల ప్రదక్షిణకు ఏర్పాట్లు పూర్తయినట్లు నిర్వాహకులు శివకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక సంజీవనగర్ రామాలయంలో ముద్ర ఫర్ నంది అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. స్థానిక ప్రథమ నందీశ్వర స్వామి ఆలయం నుంచి ఉదయం 5.30 గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. యాత్ర ఆర్టీసీ బస్టాండ్ గుండా ఆంజనేయస్వామి గుడి, మెయిన్ బజార్, గాంధీచౌక్, పార్కురోడ్డు, మూలమఠం మీదుగా మహానందిలో ముగుస్తుందన్నారు. సాయంత్రం జ్వాలా తోరణం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వైద్య, పోలీసు, ఆర్అండ్‌బీ, టూరిజం, ఎండోమెంట్ శాఖల పర్యవేక్షణలో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆధ్యాత్మిక వేత్తలు వెంకటేశ్వర్లు, హరికిరణ్, శ్రీదేవి, యాడికి శ్రీదేవి, భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి


రుద్రవరంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచనలు చేస్తున్న హౌసింగ్ ఈఈ హరిగోపాల్

రుద్రవరం: లబ్ధిదారులకు అవగాహన కల్పించి గృహ నిర్మాణాల్లో పురోగతి పెంచాలని హౌసింగ్ ఈఈ హరిగోపాల్ సూచించారు. ఆయన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈఈ మాట్లాడుతూ.. బేస్‌మెంట్ స్థాయి, ఆపైన నిర్మాణం పూర్తిచేసిన లబ్ధిదారులందరికీ ఉపాధి హామీ పథకం కింద 90 పనిదినాల మస్టర్ వేసి కూలీ సొమ్ము అందేలా చూడాలని చెప్పారు. అలాగే భవన నిర్మాణం పూర్తయిన వారు మరుగుదొడ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని, వచ్చే మార్చి 31 లోపు గృహనిర్మాణాలు పూర్తి చేసుకుంటేనే బిల్లుల చెల్లింపులు ఉంటాయని లబ్ధిదారులకు వివరించాలన్నారు. ఏఈ నాగరాజు, ఏపీఓ ప్రతాప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు ఉన్నారు.

నేడు వైద్య శిబిరం

ఉయ్యాలవాడ: స్థానిక ప్రాథమిక 24 గంటల వైద్యశాలలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నంద్యాల ఉదయానంద కంటి శస్త్ర చికిత్స నిపుణులు సౌమ్యారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరంలో వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు.